సాక్షి హనుమకొండ

మంగళవారం | 21 | జనవరి | 2025



రాష్ట్రంలోనే నంబర్ వన్ డీసీసీబీ

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు అన్నారు. - 8లో



పరస్పర బదిలీలకు..

పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్న టీచర్ల అండర్ టేకింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. - 8లో

గరిష్టం/కనిష్టం
$29^0 / 16^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ ప్రావీణ్య



హన్మకొండ అర్బన్: జిల్లాలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వేడుకల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకల్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవి.గణేశ్, డీఆర్డీఓ శ్రీను, ఆర్డీఓలు రమేశ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించండి

మంగళవారం నుంచి పకడ్బందీగా గ్రామ సభల్ని నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్డీఓలు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీలతో గ్రామ సభల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు.

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి



హన్మకొండ అర్బన్: జిల్లాలో ఈనెల 25న చేపట్టనున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటర్ల దినోత్సవ ఏర్పాట్లు, వివిధ కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కె.నారాయణ, రాథోడ్ రమేశ్, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, డీఈఓ వాసంతి, డీఐఈఓ గోపాల్, నెహ్రూ యువ కేంద్ర కో–ఆర్డినేటర్ అన్వేశ్, డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, తహసీల్దార్లు భావుసింగ్, శ్రీపాల్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్లు జన్ను శ్యాంకుమార్, విఠలేశ్వర్ పాల్గొన్నారు.


నేడు కబడ్డీ ఎంపిక పోటీలు

వరంగల్: వరంగల్ జిల్లా పురుషుల (సీనియర్స్) కబడ్డీ ఎంపిక పోటీలను నేడు(మంగళవారం) కాశిబుగ్గలోని 'ఓ సిటీ' మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్లాఖాన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 85 కిలోలలోపు బరువుండాలని, ఈసెలెక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి, త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు క్రీడాకారులతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వరంగల్‌కు అలాట్ అయిన ఎస్.శ్రీనివాస్‌ను నెక్కొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, ఇక్కడి ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ ఎస్‌బీకి, ఎస్‌బీలో ఉన్న ప్రతాప్‌ను మల్టీజోన్‌కు బదిలీ చేశారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ శిక్షణలో నగరవాసి




కాళోజీ సెంటర్: న్యూ ఢిల్లీలో ఈనెల 8 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎన్‌ఈపీ 2020 ఇన్ సర్వీస్ ట్రైనింగ్‌లో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 116 మంది ఉపాధ్యాయులకు సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ కొనసాగుతుంది. రాష్ట్రం నుంచి 10 మంది ఉపాధ్యాయులకు అవకాశం లభించగా జిల్లా నుంచి ఖిలావరంగల్ మండలం జెడ్పీహెచ్‌ఎస్ బొల్లికుంట పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు చల్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. సోమవారం తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు, తెలంగాణ చరిత్ర, దేవాలయాలు, బతుకమ్మ, బోనాల పండుగల విశిష్టతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

'పంచాయతీ' పోరు..

మొదలైంది జోరు

- పల్లెల్లో ఊపందుకున్న ఎన్నికల సందడి
- బ్యాలెట్, గుర్తులపై స్పష్టత.. ముద్రణపై యంత్రాంగం కసరత్తు
- దూకుడు పెంచిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఎన్నికల ఎత్తుగడల్లో ప్రధాన రాజకీయ పార్టీలు
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌ల చుట్టూ ఆశావహుల చక్కర్లు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికల ఏర్పాట్లపై కొద్ది రోజులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్పీడు పెంచింది. దీంతో రెండు, మూడు మాసాల్లో ఎప్పుడైనా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్‌ల ఎన్నికలు ఉండవచ్చని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో ఈనెల 26 నుంచి పథకాల పండుగకు శ్రీకారం చుడుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ కేడర్‌కు ఎన్నికలపై ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ కేడర్ పథకాలను పల్లెల్లో ప్రచారం చేస్తుండగా.. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైతం పల్లెబాట పడుతుండడంతో గ్రామాల్లో 'పంచాయతీ' సందడి జోరందుకుంది.

గుర్తులపై ఈసీ స్పష్టత... ముద్రణలో బ్యాలెట్ పత్రాలు..

2024 సెప్టెంబర్ 28న వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించిన ఎన్నికల సంఘం.. ఇటీవల బ్యాలెట్ పత్రాల రంగు, గుర్తులపై స్పష్టత ఇచ్చింది. ఈనేపథ్యంలో అధికారులు జిల్లాల వారీగా బ్యాలెట్ పత్రాల ముద్రణపై దృష్టి సారించడంతో ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఏప్రిల్ వరకు ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించవచ్చన్న ప్రచారం జోరందుకుంది. సర్పంచ్ ఎన్నికలు నిర్వహణకు నోటాతోపాటు 30 గుర్తులు కేటాయించారని, మొత్తం 31 గుర్తులతో బ్యాలెట్ పేపర్ ముద్రించనున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ డీపీఓ తెలిపారు. 30 కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే ప్రత్యేకంగా మరో బ్యాలెట్ పేపర్ ముద్రించే అవకాశాలు ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా సర్పంచ్, వార్డు సభ్యులకు వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు ఉండనుండగా.. రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తులను ప్రకటించినట్లు అధికారులు చెబుతున్నారు. సర్పంచ్ అభ్యర్థులకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థులకు ఉంగరం, కత్తెర, ఫుట్ బాల్, బ్యాట్, బ్యాడ్మింటన్, స్టంప్స్, లేడీస్ పర్సు, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, చెత్త డబ్బా, బెండకాయ, కొబ్బరి చెట్టు, వజ్రం, నల్ల బోర్డు, బకెట్, డోర్ హ్యాండిల్, చేతికర్ర, మంచం, బిస్కెట్, వేణువు, జల్లెడ, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, పడవ, చైన్, చెప్పులు, గాలిబుడగ గుర్తులను ప్రకటించారు. వార్డు సభ్యులకు పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలిండర్, గౌను, ఈల, కుండ, మూకుడు, డిష్ యాంటీనా, ఐస్క్రీమ్, గాజు, గ్లాస్, పోస్ట్ డబ్బా, కవర్, హాకీ స్టిక్, కర్రబంతి, విద్యుత్ స్తంభం, షటిల్ వంటి గుర్తులను కేటాయించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
22,45,394	11,02,801	11,42,514	79

ఇప్పటికే ఓటర్ల జాబితా.. మహిళలే అధికం

2011 జనాభాను పరిగణనలోకి తీసుకొని వార్డుల సంఖ్యను నిర్ధారించారు. మొత్తం 71 మండలాల్లో 1,705 గ్రామ పంచాయతీలు, 15,046 వార్డులున్నాయి. గ్రామంలో ఉన్న ఓటర్ల సంఖ్య, అన్ని వార్డుల్లో సమానంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు 2024 సెప్టెంబర్ 28న వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఉమ్మడి వరంగల్‌లో ఓటర్ల సంఖ్య 22,45,394లకు చేరింది.

పల్లెల్లో ఊపందుకున్న సందడి.. పోటీకి ప్రధాన పార్టీల్లో పైరవీలు

ఫిబ్రవరి – ఏప్రిల్ మాసాల మధ్య పంచాయతీ ఎన్నికలు ఖాయమన్న ప్రచారం నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల్లో పల్లె పోరు సందడి జోరందుకుంది. ఈనెల 26న రేషన్ కార్డులు, రైతు భరోసా తదితర పథకాల పంపిణీని కాంగ్రెస్ పార్టీ పండుగలా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇదే ఊపుతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ప్రయత్నంలో కేడర్‌ను అప్రమత్తం చేస్తోంది. కీలక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్న బీఆర్‌ఎస్ సైతం పల్లెపోరుకు శ్రేణులను సన్నద్ధం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో బీజేపీ పల్లెల్లోకి వెళ్తోంది. పంచాయతీ ఎన్నికల పోరుపై రోజు రోజుకూ ప్రచారం పెరుగుతుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లపై పోటీ చేసేందుకు ఆశావహులు మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతల చుట్టూ తిరుగుతున్నారు.

హనుమకొండలో సాగుతున్న లక్ష డప్పులు... వేల గొంతుకల సన్నాహక మహా ప్రదర్శన (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ





కదిలిన 'లక్ష డప్పులు.. వేల గొంతుకలు'

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండలో లక్ష డప్పులు.. వేల గొంతుకల సన్నాహక మహా ప్రదర్శన జరిగింది. మాదిగలు డప్పులతో వేయిస్తంభాల గుడి నుంచి హనుమకొండ చౌరస్తా మీదుగా అంబేడ్కర్ సెంటర్‌కు ప్రదర్శనగా చేరుకున్నారు. ప్రదర్శనలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మహా ప్రదర్శనకు ప్రతీగ్రామం నుంచి డప్పులతో తరలిరావాలని పిలుపునిచ్చారు. - హన్మకొండ - 8లో

రైల్వేస్టేషన్‌లో భద్రత పరిశీలన



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. నగరంలోని ఏటీఎం సెంటర్లు, రైల్వేస్టేషన్ ప్లాట్ ఫామ్ పై కొనసాగుతున్న బందోబస్తును ఆయన పరిశీలించారు. రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. ఆయన వెంట జీఆర్పీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అర్హుల ఎంపికలో అలసత్వం వద్దు



కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

- శాయంపేట, పత్తిపాకలో రేషన్ దరఖాస్తుల పరిశీలన
- కలెక్టర్ ప్రావీణ్య

శాయంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల అర్హుల ఎంపికలో అధికారులు అలసత్వం వహించకుండా.. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని శాయంపేట, పత్తిపాకలో ప్రభుత్వ పథకాల కోసం వచ్చిన దరఖాస్తులు, పథకాల అమలుకు కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. శాయంపేట పంచాయతీ నోటీస్ బోర్డుకు అంటించిన నాలుగో విడత రైతు రుణమాఫీ జాబితాను పరిశీలించారు. పత్తిపాక కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

భోజనం బాగుంది..

మండలంలోని మాందారిపేట గ్రామ శివారు కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం బాగుందని వంట నిర్వాహకులను ప్రశంసించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్పెషల్ ఆఫీసర్ మాధవి, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డీపీఓ రమాకాంత్, డీడబ్ల్యూఓ, మండల స్పెషల్ ఆఫీసర్ జయంతి, ఆర్డీఓ నారాయణ, పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంఈఓ భిక్షపతి, ఏఓ గంగాజమున, ఎంపీఓ రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

వేలేరు: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతున్న తీరును అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఏఓ కవితారాణి, ఎంపీఓ విమల పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్: అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ పరిధి 16వ డివిజన్ జాన్‌పాక ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సభలు పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి నేటి (మంగళవారం) నుంచి నిర్వహించే గ్రామ, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. అధికారులకు పలు సూచనలిచ్చారు.



వరంగల్ జాన్‌పాకలో సర్వేలో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద

ల్యాబ్ దందా

అనుమతుల్లేకుండా నిర్వహణ



- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- తెలంగాణ మెడికల్ కౌన్సిల్
- దాడులతో వెలుగులోకి..
- జాడ లేని వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు
- ఎంజీఎం చుట్టుపక్కల
- విచ్చలవిడిగా రక్త పరీక్ష కేంద్రాలు

ఎంజీఎం: వరంగల్, హనుమకొండ నగరాల్లో రక్త పరీక్ష కేంద్రాల (ల్యాబ్) దందా జోరుగా సాగుతోంది. వైద్య చికిత్సలందించాలంటే రక్త పరీక్షలు తప్పనిసరి కావడంతో వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రక్త, మూత్ర పరీక్షల కేంద్రాలు (ల్యాబ్స్) వెలిశాయి. వీటిని నిర్వహించాలంటే వైద్య ఆరోగ్యశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. రక్త పరీక్షలను పాథాలజిస్ట్ నిర్ధారణ చేయాలి. పాథాలజిస్ట్ వివరాల్ని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందించాలి. ఇవన్నీ అనుమతులుంటేనే ల్యాబ్ నిర్వహించాలి.. కానీ.. గ్రేటర్ వరంగల్‌లో ఏ ల్యాబ్ ఎక్కడ ఉందో.. ఎవరికి అనుమతి ఉందో.. ఎవరికి లేదో.. ఏ ల్యాబ్‌కు పాథాలజిస్ట్ ఉన్నాడో కూడా తెలియని పరిస్థితి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ల్యాబ్ నిర్వాహకుల దందా మూడు పువ్వులు.. ముప్పై ఆరు కాయలుగా సాగుతోంది.



క్రీడా మైదానంలో అనుమతి లేని రక్తనమూనాల శిబిరం(ఫైల్)

పాథాలజిస్ట్ లేకుండానే నిర్వహణ

నగరంలోని ఏ ల్యాబ్‌లో రక్త పరీక్ష చేసినా పాథాలజిస్ట్ నిర్ధారించాకే.. సదరు నివేదికను రోగికి అందించాలి. కానీ.. త్రిగనరిలో ఉన్న ల్యాబ్‌లో ఒకే పాథాలజిస్ట్ నాలుగైదు ల్యాబ్‌లకు కొనసాగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. సదరు పాథాలజిస్టులు రోజుకు ఎన్ని ల్యాబ్‌లు సందర్శిస్తున్నారు. ఏ మేరకు వాటిని పరిశీలిస్తున్నారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొందరు ల్యాబ్ నిర్వాహకులైతే పాథాలజిస్ట్ సమాచారం అందించకుండానే వారి పేరును వాడుకుంటూ నివేదికలు అందించడం పరిపాటిగా మారింది.

అనుమతుల్లేకుండానే రక్త నమూనాల సేకరణ

కొద్దిరోజుల క్రితం నగరంలోని సీకేఎం కళాశాల మైదానంలో డీఎంఎల్‌టీ చేసిన వ్యక్తి కాకతీయ హెల్త్ కేర్‌సెంటర్ పేరుతో అనుమతుల్లేకుండా ఓ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశాడు. వాకర్స్ నుంచి రక్తనమూనాలు సేకరించాడు. అనంతరం వీటిని హనుమకొండలోని మణిపాల్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించి వాకర్స్‌కు అందించాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేశ్ శిబిరాన్ని తొలగించారు. వైద్యారోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా.. సదరు వ్యక్తి అందించిన నివేదికలో పేర్కొన్న పాథాలజిస్ట్ ఇది తన నిర్ధారణ నివేదిక కాదని పేర్కొనడం కొసమెరుపు. ఇలా.. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వరంగల్ నగరంలో ల్యాబ్‌ల దందా యథేచ్ఛగా సాగుతోంది.

ఎంజీఎం కేంద్రంగా వ్యాపారం

ఎంజీఎం ఆస్పత్రిలోని రోగులే లక్ష్యంగా ఆస్పత్రి చుట్టూ ఉన్న ల్యాబ్ నిర్వాహకులు దందా కొనసాగిస్తున్నారు. దళారుల ద్వారా రోగుల వద్ద నుంచి శాంపిళ్లు సేకరిస్తున్న తతంగం గత కొన్ని రోజుల క్రితం వెలుగు చూసింది. దీంతో ఎంజీఎం పరిపాలనాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంజీఎం చుట్టు పక్కల ఉన్న ల్యాబ్ నిర్వాహకులు కనీసం నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నా.. వైద్యారోగ్యశాఖ అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదో అర్థంకాని పరిస్థితి.

రూ.750 కోట్లతో గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి రానన్ని నిధులు స్టేషన్ ఘన్‌పూర్‌కు వచ్చాయని.. రూ.750 కోట్ల నిధులతో గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని పెద్దపెండ్యాలలో రూ.1.75 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణం, రూ.20 లక్షలతో గౌడ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. పెద్దపెండ్యాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు, త్వరలో మంజూరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ అఫ్జల్, నాయకులు తోట నాగరాజు, రాజారపు యాదగిరి, గుర్రపు ప్రసాద్, వల్లపురెడ్డి రాంరెడ్డి, రావుల వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, బొడ్డు లెనిన్, సాంబయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్ట్

- రూ.8.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న దంపతులను అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. వీరినుంచి సుమారు రూ.8.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటారం గ్రామానికి చెందిన దంపతులు మద్దూరి సత్యనారాయణ, చెల్ల స్వప్న హనుమకొండ కుమార్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. సత్యనారాయణ కుల వృత్తి చేస్తుండగా, స్వప్న ఇంటి వద్దే ఉంటుంది. సత్యనారాయణకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సులో చోరీలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా గతేడాది హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ, వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాలను స్వప్న చోరీ చేసి భర్తకు అందజేసింది. డిసెంబర్‌లో మరోసారి హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఇద్దరు మహిళల మెడల్లో, సైడు బ్యాగులో బంగారు ఆభరణాలను చోరీ చేశారు. వరుస చోరీలపై అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో చోరీ చేసిన సొత్తును విక్రయించడానికి హనుమకొండ టైలర్స్ స్ట్రీట్ నుంచి వెళ్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఈ దంపతులపై అనుమానం వచ్చింది. తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్, ఎస్సైలు అశోక్ కుమార్, కిశోర్, ఏఎ సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ, రాహుఫ్, కానిస్టేబుళ్లు మహేశ్, అశోక్, వీరన్న, భాస్కర్‌ను ఏసీపీ అభినందించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్



కాజీపేట అర్బన్ : విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ప్రతీ ఒక్కరు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్ పేర్కొన్నారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైబ్రేరియన్స్ అండ్ పబ్లిషర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా రియాజ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. మెరుగైన సమాజ నిర్మాణంలో లైబ్రేరియన్లు, పబ్లిషర్లు ముఖ్య భూమిక పోషిస్తారని, నిట్‌లో సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, నిట్ లైబ్రరీ అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఆనంద్‌కిషోర్, లైబ్రేరియన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ

హసన్‌పర్తి : హసన్‌పర్తిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ మేనేజర్ రవి పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు శిక్షణ పొందడానికి అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు, తెలుపు రేషన్‌కార్డు కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. నెలరోజుల శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 24వ తేదీలోపు సంస్కృతీ విహార్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 98493 07873 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సామాన్యులే ప్రత్యేక అతిథులై..

న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో నలుగురు పాల్గొనే అవకాశం

- చేపల వ్యాపారంలో రాణిస్తున్న బైరి పట్టాభి.
- స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న అరుణ
- కేంద్రం అమలు చేస్తున్న పీఎం యశస్వి పథకానికి ఎంపికైన శాలిని
- మన్ కీ బాత్‌లో పాల్గొన్న మల్లారెడ్డికి చాన్స్



చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం

సాక్షి, వరంగల్: న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా నుంచి నలుగురు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు. ఈ నెల 26వ తేదీన న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలో పీఎం యశస్వి పథకం, గ్రామీణాభివృద్ధి, పీఎం మత్స్య సంపద యోజన బెనిఫిషియర్స్, మన్ కీ బాత్‌లో పాల్గొన్న వారితో పాటు విభిన్న రంగాల్లో రాణించిన వారికి కేంద్రం అవకాశం కల్పించింది. పీఎం యశస్వి పథకం గురించి కృషి చేసిన నర్సంపేటలోని ప్రభుత్వ బీసీ కాలేజీ బాలికల హాస్టల్ నుంచి భీమగాని శాలిని, గ్రామీణాభివృద్ధి రంగంలో సేవలందించిన వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన ఎడ్ల అరుణ, పీఎం మత్స్య సంపద యోజన బెనిఫిసియర్స్ కేటగిరి కింద కరీమాబాద్‌లోని ఉర్సు గుట్టకు చెందిన బైరి పట్టాభి, మన్ కీ బాత్‌లో పాల్గొన్న గీసుకొండ మండలం గంగాదేవిపల్లిలోని గోనె మల్లయ్య ప్రత్యేక అతిథులుగా జిల్లా నుంచి హాజరుకానున్నారు.

అరుదైన అవకాశమిది...



మహిళలు ఆర్థికంగా బలపడితేనే గ్రామాల అభివృద్ధి సాధ్యం. అదే దేశాభివృద్ధి దిశగా అడుగులు పడుతుంది. ఇదే ఆచరణకు వస్తే దేశాభివృద్ధి జరుగుతోంది. ఈ దిశ వైపు కృషి చేస్తున్న ఓరుగల్లు మహా సమాఖ్య అధ్యక్షురాలు వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామవాసి ఎడ్ల అరుణకు కేంద్రం నుంచి గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనే అవకాశం వరించింది. ఇల్లంద గ్రామంలో రాధ సంఘం అధ్యక్షురాలిగా మొదలైన ఈమె ప్రయాణం...ఆ తర్వాత 30 మహిళా సంఘాలకు సమాఖ్య అధ్యక్షురాలిగా...అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు మండలాల్లో ఆదర్శ మండలాలుగా గుర్తింపు దక్కించుకొని 2009 మార్చి 11న ఏర్పాటైన ఓరుగల్లు మహా సమాఖ్యకు అధ్యక్షురాలిగా అరుణ అవకాశం వచ్చింది. ఇలా ఈమె పేదరిక నిర్మూలనతో పాటు స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ సేవలను గుర్తించిన కేంద్రం గ్రామీణాభివృద్ధి కింద ప్రత్యేక ఆహ్వానం పంపింది. అలాగే వరంగల్ జిల్లా ఆరెపల్లి ఎంజేపీలో పదో తరగతి చదివి ప్రస్తుతం నర్సంపేటలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న భీమగాని శాలిని కేంద్రం అమలు చేస్తున్న పీఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనానికి ఎంపికైంది. ఈమెకు కూడా కేంద్రం నుంచి రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించింది.

గ్రామస్తులు సాధించిన విజయాలకు గుర్తింపు



న్యూఢిల్లీలో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొడానికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందటం సంతోషంగా ఉంది. ఇదంతా గంగాదేవిపల్లి గ్రామస్తులు సాధించిన విజయాలకు గుర్తింపు. 2014లో ఢిల్లీలో ప్రధాని మోదీ మా గ్రామం సాధించిన ప్రగతి, ప్రజల భాగస్వామ్యం, జాతీయ స్థాయిలో ఉన్నతంగా నిలిచిన తీరును దూరదర్శన్‌వారు ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని వీక్షించి అభినందించారు. 2017 ఫిబ్రవరి 26న రేడియో ద్వారా ప్రసారమైన మన్‌కీ బాత్‌లో గ్రామ పద్ధతిని, సాధించిన విజయాలను ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యం విషయంలో గ్రామం దేశంలోనే ఆదర్శంగా నిలిచింది.

- గోనె మల్లారెడ్డి, గంగాదేవిపల్లి మాజీ సర్పంచ్

చేపల వ్యాపారంలో ప్రత్యేకత...

కరీమాబాద్‌లోని ఉర్సు గుట్టకు చెందిన బైరి పట్టాభి తండ్రి వారసత్వంగా వచ్చిన చేప పిల్లల పెంపకం వృత్తిని కొనసాగిస్తున్నారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఓబులాపూర్ గ్రామంలో 15 ఎకరాల విస్తీర్ణంలో సాయినాథ్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం, వరంగల్ ఉర్సుగుట్టలోని అమ్మవారిపేటలో 20 ఎకరాల విస్తీర్ణం, వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లిలో 10 ఎకరాల విస్తీర్ణంలో చేప పిల్లల ఉత్పత్తి వ్యాపారాన్ని విస్తరించి సోదరుడు హరినాథ్ సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నారు. పీఎం మత్స్య సంపద యోజన పథకం కింద రూ.25 లక్షల నిధులు వచ్చాక ఈ చేప పిల్లల ఉత్పత్తి వ్యాపారం మరింత ఊపందుకుంది.



బైరి పట్టాభి

కావాల్సినన్ని మగ, ఆడ పిల్లల చేపలతో పిల్లలు ఉత్పత్తి చేసి మత్స్యకార సొసైటీలకు విక్రయిస్తున్నారు. జూన్, జూలై, ఆగస్టు వచ్చిందంటే చాలు ఈ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల వద్ద హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్, ములుగు, హనుమకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల నుంచి సొసైటీ సభ్యులు కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లోని చెరువుల్లో పోసుకుంటున్నారు. ఇలా తాను వ్యాపారం చేయడమే కాకుండా వందలాది మంది వ్యాపారం చేసి ఆర్థికంగా నిలబడేలా బైరి పట్టాభి ముందుకెళుతుండడంతో గుర్తించిన కేంద్రం ఈ నెల 26న ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథిగా పట్టాభికి ఆహ్వానం పంపింది. ఆ రోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సత్కారం పొందనున్నారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యుఒడికి..

- అదుపు తప్పి పల్టీకొట్టిన కారు.. విద్యార్థి మృతి
- ఒకరికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలు
- పెంబర్తి వై జంక్షన్ సమీపంలో ఘటన

జనగామ : స్నేహితుడి ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి ఆరుగురు విద్యార్థులు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృత్యుఒడికి చేరగా, ఒకరికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జనగామ జిల్లా పెంబర్తి వై జంక్షన్ సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం ఆముదాపల్లికి చెందిన విద్యార్థి పెద్దపల్లి అభిచరణ్, పోలీసుల కథనం ప్రకారం.. ఆముదాలపల్లికి చెందిన పెద్దపల్లి అభిచరణ్, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నెంపల్లికి చెందిన బండ గణేశ్, ఇదే జిల్లా మెట్‌పల్లికి చెందిన తోట అక్షిత్, బహదూర్‌పురా మండలం అంబర్‌పల్లికి చెందిన గుజ్జుల నందు, కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లన్నపల్లెకు చెందిన కన్నివేసి అంజి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కురికిశాల గ్రామానికి చెందిన బద్దం సిద్ధారెడ్డి(20) స్నేహితులు. ఇందులో సిద్ధారెడ్డి హనుమకొండలోని వాగ్దేవి, మిగతా వారు వివిధ కళాశాలల్లో చదువుకుంటున్నారు. హైదరాబాద్‌లోని తమ స్నేహితుడి ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆరుగురు ఆదివారం అర్ధరాత్రి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్ సమీపంలో కారు అదుపు రోడ్డు పక్కన గుంతలోకి పల్టీలు కొట్టింది. దీంతో కారు డోర్ ఊడిపోవడంతో



పల్టీకొట్టిన కారు



సిద్ధారెడ్డి(ఫైల్)

సిద్ధారెడ్డి బయటకు ఎగిరి పడగా అంజికి తీవ్రగాయాలయ్యాయి. మిగతా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అక్షిత్ వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా, సిద్ధారెడ్డి మార్గమధ్యలోనే మృతి చెందాడు. అంజి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలించారు. ఎస్సై రాజన్‌బాబు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేశారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

కారు ప్రమాద ఘటన తెలుసుకున్న వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు జనగామ జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మహేందర్‌రెడ్డి, లావణ్య దంపతులకు సిద్ధారెడ్డితో పాటు కూతురు ఉంది. సిద్ధారెడ్డిని హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో సిద్ధారెడ్డి మృతి చెందడంతో కొడుకుపైనే ఆశలుపెట్టుకున్న ఆ తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగారు. కుమారుడి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు. సిద్ధారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా..

- డ్రైవర్ మృతి.. మొట్లగూడెంలో ఘటన
- మృతుడిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మంగపేట : అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా మంగపేట మండలం మొట్లగూడెం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ముత్యాలమ్మపేటకు చెందిన ప్రశాంత్ (25) ములుగు జిల్లా మంగపేట మండలం నర్సింహాసాగర్ గ్రామంలోని రైతు తాటి సమ్మయ్యకు చెందిన జామాయిల్ కలపను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు. మొట్లగూడెం సమీపంలో



ప్రశాంత్ మృతదేహం

ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రశాంత్ ట్రాక్టర్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుని అక్కడికక్క డే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేర కు ఎస్సై టీవీఆర్ సూరి ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమి త్తం సోమవారం మృతదేహాన్ని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తాత రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి నాగమణి, తమ్ముడు రాంపండు ఉన్నారు.

రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా డీసీసీబీ



దశాబ్ది డిపాజిట్ పథక కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, డైరెక్టర్లు

- రూ.2,100 కోట్ల టర్నోవర్‌తో అగ్రస్థానం
- డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ : రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) నంబర్ వన్‌గా ఉందని ఆ బ్యాంక్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పేర్కొన్నారు. సోమవారం నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ మహాజన సభ జరిగింది. ఈ సభలో చైర్మన్ రవీందర్ రావు మాట్లాడారు. పాలకవర్గం బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.885 కోట్ల టర్నోవర్..ఇప్పుడు రూ.2,100 కోట్లకు చేరుకుందని వివరించారు. పంట రుణాలు రూ.372 కోట్ల నుంచి రూ.600 కోట్లకు, ఎల్‌టీ రుణాలు రూ.150 కోట్ల నుంచి రూ.342 కోట్లకు పెరిగాయని వెల్లడించారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టి రూ.118 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. నాబార్డు సాయంతో 50 ప్రాథమిక సహకార సంఘాలను మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేశామన్నారు. రైతుల పిల్లలు విదేశీ విద్య అభ్యసించేందుకు రుణాలు అందించామని వివరించారు. ప్రతి మండలంలో డీసీసీబీ బ్రాంచీ ఏర్పాటుకు రిజర్వు బ్యాంకుకు ప్రతిపాదనలు పంపామన్నారు. రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీ ఏ–గ్రేడ్ సర్టిఫికెట్ అందుకుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టి కరపత్రాలు ఆవిష్కరించారు.

నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్స్‌కు వడ్డీతో ఖర్చుల చెల్లింపు

డీసీసీబీలో ఖాళీగా ఉన్న భవన సముదాయాన్ని అద్దెకు ఇచ్చిన అంశంలో కొంత ఉపశమనం లభించింది. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసినందుకు అయిన ఖర్చులను వడ్డీతో సహా చెల్లించాలని కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు డీసీసీబీ పాలక వర్గం ఏడుగురు డైరెక్టర్లతో ప్రత్యేక కమిటీ వేసింది. నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్స్‌కు రెండు వాయిదాలో మొత్తం రూ.3,23,93,099 డీసీసీబీ చెల్లించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ తీర్మానాన్ని సోమవారం వరంగల్ డీసీసీబీ మహాజన సభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది.

అధికారుల తీరుపై ఆగ్రహం..

జిల్లా సహకార అధికారుల తీరుపై డీసీసీబీ డైరెక్టర్లు, సంఘాల చైర్మన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరో చెప్పారని తమపై కక్షసాధింపు, కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రైతులకు సహకరించి ధాన్యం తరలిస్తే రవాణా ఖర్చులు ఎలా చూపెడతారని జిల్లా సహకార అధికారి తమపై చర్యలు తీసుకోవాలని చూస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కక్కిరాల హరిప్రసాద్ మండిపడ్డారు. మరో డైరెక్టర్ చెట్టుపల్లి మురళీధర్ తమ సొసైటీపై కుట్రలకు పాల్పడుతున్నారని, నాచినపల్లి సొసైటీపై చర్యలు తీసుకుంటే కోర్టుకు వెళ్లామని వరంగల్ డీసీఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ఇతర సంఘాల చైర్మన్లు మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ ఎండీ వజీర్ సుల్తాన్, జిల్లా సహకార అధికారులు, డీసీసీబీ డైరెక్టర్లు, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

నేటినుంచి అర్హుల ఎంపిక

- ప్రభుత్వ పథకాలపై వార్డు సభలు
- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వెల్లడి

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ పరిధిలో సంక్షేమ పథకాల అర్హుల ఎంపికకు మంగళవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఈమేరకు వార్డు సభల్లోని ప్రాంతాలను వెల్లడిస్తూ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలకు అర్హుల గుర్తింపు జరగనుంది. ఈనెల 24 వరకు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి తుది జాబితాను ఖరారు చేశాక.. ఆజాబితాలో అర్హులను కమిటీల ద్వారా ఎంపిక చేయనున్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల జబితాను స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి సమర్పిస్తారు. తుది జబితాను ఖరారు చేసి అర్హుల వివరాలను ప్రకటిస్తారు.

అభ్యంతరాల స్వీకరణ

పథకాలపై ఇప్పటికే ఇంటింటా సర్వే పూర్తయినందున వార్డు సభ ఎదుట ప్రదర్శిస్తారు. ఏమైనా అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితా ఖరారు కానుంది. అనర్హులను ఎంపిక చేస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై వేటు పడుతుందని ఇప్పటికే ఉన్నతధికారులు హెచ్చరించారు. కాశిబుగ్గ, కాజీపేట డిప్యూటీ కమిషనర్లు వార్డు సభలను పర్యవేక్షించనున్నారు.

నేడు వార్డు సభలు జరిగే డివిజన్లు (కాజీపేట సర్కిల్ పరిధిలో)

డివిజన్	ప్రాంతం
1	పెగడపల్లి
7	వార్డు ఆఫీస్
47	వార్డు ఆఫీస్
51	వార్డు ఆఫీస్
52	వార్డు ఆఫీస్
54	వార్డు ఆఫీస్
59	వార్డు ఆఫీస్
61	సిద్ధార్థ నగర్ కమ్యునిటీ హాల్
66	హసన్‌పర్తి గ్రామ పంచాయతీ

కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో

12	షాదీఖానా
19	కాశిబుగ్గ వీవర్స్ కాలనీ స్వశక్తి భవన్
22	ఇన్నర్ వీల్ క్లబ్
25	పద్మాక్షి భవన్ కిడ్డీ కూప్ స్కూల్
28	బృందావన కాలనీ
37	ఈస్ట్ ఫోర్ట్, పోచమ్మ తల్లి దేవాలయం
36	చింతల్ కమ్యూనిటీ హాల్
40	సీఆర్‌సీ భవన్ కరీమాబాద్
11	పోతన నగర్ కమ్యూనిటీ హాల్
14	ఏనుమాముల కమ్యూనిటీ హాల్
16	ధర్మారం గ్రామపంచాయతీ హాల్

నేడు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌లకు ఎంపిక పోటీలు

వరంగల్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పోటీల్లో పాల్గొనే వరంగల్ జిల్లా జట్ల ఎంపికలను నేడు (మంగళవారం) ఉదయం 10 గంటలకు వరంగల్ కాశిబుగ్గలోని ఓసిటీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ టీవీఎల్ సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, ఖోఖో, యోగా మొత్తం 14అంశాల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పాల్గొనాలని, తమ వెంట ఉద్యోగ గుర్తింపు కార్డుతోపాటు ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు.

పరస్పర బదిలీలకు అండర్ టేకింగ్

- 92 మందికి 86మంది టీచర్లు.. ఇద్దరు నాట్‌విల్లింగ్



అండర్‌టేకింగ్ ఇస్తున్న ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి : పరస్పర బదిలీలకు దరఖాస్తులు చేసుకున్న టీచర్ల అండర్ టేకింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. హనుమకొండ జిల్లాకు వివిధ జిల్లాల నుంచి ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ తదితర కేటగిరీల ఉపాధ్యాయులు 92 మంది దరఖాస్తు చేసుకున్నారు. హనుమకొండ డీఈఓ కార్యాలయంలో సోమవారం ఎక్కువ మంది ఉపాధ్యాయులు అండర్ టేకింగ్ ఇచ్చారు. అలాగే సర్వీస్‌బుక్స్‌ను పరిశీలన చేయించుకున్నారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చే ఉపాధ్యాయులతోపాటు ఇక్కడినుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారు కూడా అండర్ టేకింగ్ ఇస్తున్నారు. 92మంది ఉపాధ్యాయుల్లో సోమవారం సాయంత్రం వరకు 86మంది పరస్పర బదిలీలకు అండర్ టేకింగ్ ఇవ్వగా మరో ఇద్దరు నాట్ విల్లింగ్ ఇచ్చారు.ఆ ఇద్దరు పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకొని ఇప్పుడు వెనక్కి తగ్గారు. నేటివరకు అండర్ టేకింగ్ ప్రక్రియకు అవకాశం ఉండగా, 22న వారి వివరాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు డీఈఓ పంపనున్నారు.

స్పౌజ్ కేటగిరీ బదిలీ.. జిల్లాకు ఐదుగురు కేటాయింపు

ఎట్టకేలకు స్పౌజ్ కేటగిరీ టీచర్ల బదిలీలకు అవకాశం లభించింది. హనుమకొండ జిల్లాకు స్పౌజ్ కేటగిరీలో ఐదుగురి బదిలీలకు అవకాశం కల్పిస్తూ సోమవారం సాయంత్రం డీఈఓకు జాబితా వచ్చింది. అందులో పాకరాజు (బయోసైన్స్), బానోత్ కృష్ణ (సోషల్‌స్టడీస్), ఎస్జీటీలు ముగ్గురు అరుణ్ జ్యోతి, నాగారం సరళ, రాంభూపాల్ స్పౌజ్ కేటగిరీలో హనుమకొండకు కేటాయించారు. వీరికి జిల్లాలోని క్లియర్ వెకన్సీల్లో పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వబోతున్నారు. వీరికి సంబంధించిన పలు వివరాలను పరిశీలించాకే రెండు మూడురోజుల్లో డీఈఓ వాసంతి వీరికి పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చే అవకాశాలున్నాయి.

రెండు కిలో మీటర్లు.. మూడున్నర గంటలు

మాదిగల్లో ఉత్తేజం నింపిన మహాప్రదర్శన

- డప్పు చప్పుళ్లు, పాటలతో కదం తొక్కిన కార్యకర్తలు
- వర్గీకరణను అడ్డుకుంటున్న వారిని ఎదుర్కోవాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మహాప్రదర్శనలో డప్పు కొడుతున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: రెండు కిలో మీటర్లు.. మూడున్నర గంటలు.. హనుమకొండలో నిర్వహించిన లక్ష డప్పులు, వేల గొంతుకల సన్నాహక మహాప్రదర్శన ఉత్తేజం నింపింది. సోమవారం హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు, కళాకారులు పూజలు నిర్వహించి మధ్యాహ్నం 12.30 గంటలకు మహా ప్రదర్శన ప్రారంభించారు. వేయి స్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు దాదాపు రెండు కిలో మీటర్ల దూరం మూడున్నర గంటల పాటు మహాప్రదర్శన సాగింది. దారి పొడుగున మంద కృష్ణతోపాటు, ఆయా పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కళాకారులు తరలివచ్చిన డప్పులు వాయిస్తూ, పాడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ, నాయకులు, కళాకారులు.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ ప్రదర్శన విజయవంతం కావడంతో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ శ్రేణులతోపాటు మాదిగ జాతిలో స్ఫూర్తి నింపింది. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుల మహా ప్రదర్శనకు కార్యోన్ముఖులయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 30 వేలకు పైగా తరలివెళ్లనున్నట్లు వక్తలు చెప్పారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణను అడ్డుకుంటున్న వివేక్ కుటుంబాన్ని ఎదుర్కోవాల్సిన బాధ్యత ప్రతి మాదిగ బిడ్డపై ఉందన్నారు. ధర్మం, న్యాయం, సమాజం, పార్టీలు, ప్రధాన మంత్రితో సహా మాదిగల పక్షాన, వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకుంటే ఆయనను శత్రువుగా చూడమన్నారు. అయితే వర్ధన్నపేట ఎమ్మెల్యేతో సహా మాల ఎమ్మెల్యేలు, ఎంపీలను చిత్తుగా ఓడిస్తామన్నారు. ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి ప్రతీ మాదిగ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్, ఆయా పార్టీలు, ఆయా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు గోనె ప్రకాశ్ రావు, పృథ్వీరాజ్, నమిండ్ల శ్రీనివాస్, గిద్దె రాంనర్సయ్య, గంగ, వరంగల్ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, దరువు ఎల్లన్న, రాంబాబు, అమూల్య, నలిగంటి శరత్, సయ్యద్ ఇస్మాయిల్, మాట్ల తిరుపతి, బుర్ర సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్ : ప్రదర్శనకంటే ముందుగా వేయిస్తంభాల దేవాలయాన్ని మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, గాయకుడు మిట్టపల్లి సురేందర్ తదితరులు సందర్శించారు. రుద్రేశ్వర స్వామి వద్ద డప్పులు ఉంచి పూజలు చేశారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి మనసు కరిగి ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే శాసన సభలో ఆమోదించేలా రుద్రేశ్వరుడు కరుణించాలని తాము కోరుకున్నామని తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు ఉపేంద్రశర్మ వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం అందజేశారు.



ఆలయంలో డప్పుతో మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే రమేశ్ తదితరులు